

ఐటెప్ కోర్సు ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ యూనివర్సిటీలోని నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్యాకోర్సు(ఐటెప్) 1,3 సెమిస్టర్‌ల ఫలితాలను సోమవారం విడుదల చేశారు. 1 సెమిస్టర్‌లో బీఏ, బీఈడీ కోర్సులో 9మంది హాజరై 8 మంది, బీఎస్సీ బీఈడీ కోర్సులో 33కు 29మంది ఉత్తీర్ణులయ్యారు. 3వ సెమిస్టర్‌లో బీఏ బీఈడీ కోర్సులో ముగ్గురు(శతాశాతం), బీఎస్సీ బీఈడీలో 25కు 18మంది పాసయ్యారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్‌లో ఉంచామని డీన్ డాక్టర్ ఉదయభాస్కర్ తెలిపా రు. ఫలితాలపై సందేహాలుంటే 15రోజుల్లో పునః మూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



అవార్డు అందుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పలాస జీడికి జాతీయ అవార్డు

5లో


శ్రీకాకుళం పొట్టిశ్రీరాముల మార్కెట్‌లో ఎండ నుంచి రక్షణ ఇలా..

వేసవిలా ఎండలు

● పగటిపూట అత్యధిక ఉష్ణోగ్రతల నమోదు

4లో


రిమ్స్‌లో ఓపీ విభాగం వద్ద బారులుదీరిన రోగులు

రిమ్స్‌లో ఓపీ టోకెనా.. వామ్మో!


అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సినీనటుడు ఆర్.నారాయణమూర్తి, విప్ అశోక్, తదితరులు

థర్మల్ ఉద్యమం..

చరిత్రలో నిలిచే పోరాటం

● అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవాలి

● 329 జీవో రద్దు చేయాలి: సినీనటుడు ఆర్.నారాయణమూర్తి

సోంపేట, జూలై 14(ఆంధ్రజ్యోతి): 'సోంపేట పరిసర ప్రాంతాల్లో థర్మల్ పవర్‌ప్లాంట్‌కు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమం.. చరిత్రలో నిలిచిపోయే పోరాటం. ప్రజావ్యతిరేఖ నిర్ణయాలు తీసుకునేవారికి ఇదొక చెంపపెట్టుగా నిలుస్తుందని సినీనటుడు ఆర్.నారాయణమూర్తి, పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం బారువలో థర్మల్ అమరుల సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా అమరవీరుల స్థూపం వద్ద సినీనటుడు నారాయణమూర్తితో కలిసి విప్ బెందాళం అశోక్ తదితరులు నివాళి అర్పించారు. మొక్కలు నాటారు. అనంతరం ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ 'థర్మల్ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అభినందనలు. థర్మల్ జీవోను రద్దు చేసినా, ఇంకా 329జీవో పేరుతో పారిశ్రామికవేత్తలకు భూములు కట్టబెట్టే యత్నం జరుగుతోంది. ప్రభుత్వం ఈ జీవోను కూడా రద్దు చేయాలి. వ్యవసాయానికి ఆమోదయోగ్యమైన భూముల్లో పరిశ్రమలు పెట్టరాదనే సుప్రీంకోర్టు తీర్పునకు కట్టుబడి ఉండాలి. థర్మల్ పోరులో అమరులైన కుటుంబాలను ఆదుకోవాలి. ఉద్యమాల (మిగతా 4వ పేజీలో..)

గురుకులంలో 18 మందికి జ్వరాలు

● పాతపట్నం సీహెచ్‌సీలో విద్యార్థినులకు వైద్యసేవలు

4లో


పెంద్రువాడ కాలనీ సమీపంలో వంశధార కాలువ గట్టుకు పడిన రంధ్రం

వంశధార ఎడమ కాలువ గట్టుకు గండి

6లో

కష్టాల ఖరీఫ్


టెక్కలి రూరల్ : కొల్లివలస వద్ద వరినారుకి నీటిని అందిస్తున్న రైతు

● సీజన్ ఆరంభంలోనే ఇబ్బందులు ● ఎండిపోతున్న వరినారు, ఎదలు

● ఆందోళనలో రైతులు ● వర్షం కోసం ఎదురుచూపులు

టెక్కలి రూరల్/ సరుబుజ్జిలి/పలాస రూరల్/ ఎల్.ఎన్.పేట, జూలై 14(ఆంధ్రజ్యోతి):

ఖరీఫ్ సీజన్ వేళ.. జిల్లాలో ప్రస్తుతం ఆశించినస్థాయిలో వర్షాలు లేక వరినారు (ఆకుమళ్లు) ఎండిపోతోంది. ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది మే నెలాఖరు నాటికే నైరుతి రుతుపవనాలు వచ్చాయి. జూన్‌లో అధికంగా వర్షాలు కురిశాయి. దీంతో వరి నారు తయారు చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. కొంతమంది రైతులు బురదలోనే వరినారు వేశారు. కాగా, గత 20 రోజుల నుంచి వర్షాలు సక్రమంగా కురవకపోవడం, ఎండలు తీవ్రత పెరగడంతో వరినాట్లు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువుల్లో నీటిని ఇంజన్ల ద్వారా అందించి.. వరినారుని కాపాడుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. మరికొందరు గూడలు ఏర్పాటు చేసుకుని వరినారుకి నీటితడి అందిస్తున్నారు.

● జిల్లాలో 4,47,382 ఎకరాల్లో వరిసాగు చేయనున్నారు. ఈ ఏడాది 1.45 లక్షల ఎకరాల్లో దమ్ముల ద్వారా వరినాట్లు వేసేందుకు రైతులు సిద్ధమయ్యారని వ్యవసాయ అధికారుల అంచనా. మిగిలిన రైతులు ఎద ద్వారా సాగు చేయనున్నారు. ఏటా జూలైలో దమ్ములు ప్రారంభమై వరినాట్లు వేస్తారు. కానీ, ఈ ఏడాది వర్షాలు లేక వరినాట్లు ఆలస్యమవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. చాలాచోట్ల వరినారు ఎండిపోతోందని, ఖరీఫ్ ఆరంభంలోనే తమకు సాగునీటి కష్టాలు తప్పడం లేదని పేర్కొంటున్నారు. టెక్కలి, మెళియాపుట్టి తదితర మండలాల్లోని ఆకుమడులు, ఎదలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. పలాస మండలంలోని కైజోల, రెంటికోట, బ్రాహ్మణతర్లా, లక్ష్మీపురం, గోపాలపురం, కేశుపురం, నారాయణపురం, నీలిబద్ర, బంటుకొత్తూరు గ్రామాలతోపాటు గిరిజన, ఉద్దాన ప్రాంతాల్లో రైతులు ఎదల రూపంలో విత్తనాలు చల్లారు. ఆయా రైతులంతా వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు.


● సరుబుజ్జిలి మండలం కొండవలసలో సైలాడ చెరువు ఆయకట్టు కింద సుమారు 600 ఎకరాలు రైతులు సాగు చేస్తున్నారు. ఇటీవల వంశధార కుడికాలువ ద్వారా అధికారులు సాగునీటిని విడుదల చేశారు. కానీ, కొద్దిగంటల్లోనే మళ్లీ సాగునీటిని నిలిపేశారు. పూడికతీత పనులు పూర్తికాకపోవడంతో కాల్వలో నీటిని కిందిస్థాయికి రాకుండానే నిలిపేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరిపైర్లు ఎండిపోతున్నా (మిగతా 4వ పేజీలో..)


పలాస రూరల్ : దాగనోర వద్ద వర్షాలు లేక మాడిపోతున్న ఆకుమడి


సరుబుజ్జిలి : కొండవలసలో ఎండిపోతున్న వరినాట్లు

నేటి నుంచి ఏపీపీఎస్సీ పరీక్షలు

● పకడ్బందీగా ఏర్పాట్లు: డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు


డీఆర్వో వేంకటేశ్వరరావు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ లెక్చరర్ పోస్టులకు నిర్వహించే కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ఈ నెల 15 నుంచి 23 వరకు పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేలా (మిగతా 4వ పేజీలో..)

'ఐటీఐ' కౌన్సెలింగ్ గడువు పొడిగింపు

ఎచ్చెర్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశానికి రెండో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 15 నుంచి 20వరకు పొడిగించినట్టు జిల్లా అడ్మిషన్ల కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'ఆసక్తి గల అభ్యర్థులు చేరాల్సిన ఐటీఐకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఐటీఐ డాట్ ఏపీడాట్ జీవోవీ డాట్‌ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేయాలి. ఒరిజనల్ సర్టిఫికెట్లను సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో 22వ తేదీలోగా పరిశీలన పూర్తిచేయించాలి. 23నశ్రీకాకుళం డీఎల్‌టీసీలో, 24న ఎచ్చెర్లలో ప్రభుత్వ ఐటీఐలో, 25న పలాసలోని డాక్టర్ వి.కణితీస్ ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశానికి ఈ నెల 26,27 తేదీల్లో కౌన్సెలింగ్ ఉంటుంది. అభ్యర్థులు నిర్ధేశించిన తేదీల్లో కౌన్సెలింగ్‌కు హాజరుకావాల'ని సుధాకరరావు సూచించారు.

కొత్త పోలీస్‌స్టేషన్లు ఎప్పుడు?


కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్

● ప్రతిపాదనల్లోనే రెండో స్టేషన్ ఏర్పాటు

● కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

కాశీబుగ్గ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్త పోలీస్ స్టేషన్ల ఏర్పాటు జాప్యమవుతోంది. ముఖ్య పట్టణాల్లో రెండో స్టేషన్ ప్రతిపాదనలు దశాబ్దాలుగా కార్యరూపం దాల్చడం లేదు. ఉమ్మడి జిల్లా పరిధిలో 12 పోలీస్ సర్కిల్స్ ఉండేవి. మొత్తం 44 పోలీస్‌స్టేషన్లు కొనసాగేవి. కానీ జిల్లా విభజనతో పాలకొండ సర్కిల్ పార్వతీపురం మన్యం జిల్లాలోకి.. రాజాం సర్కిల్ విజయనగరం జిల్లాలోకి చేరింది. దీంతో జిల్లాలో పోలీస్‌స్టేషన్లు తగ్గుముఖం పట్టి.. 38కి చేరుకుంది. జిల్లాలో ప్రతి మండలానికి ఒక పోలీస్‌స్టేషన్ ఉంది. కానీ పాతపట్నం నియోజకవర్గంలోని ఎల్ఎన్‌పేట మండలానికి మాత్రం లేదు. ఆ మండలం సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్ పరిధిలో కొనసాగుతోంది. చాలా మండలాల్లో జనాభా ప్రతిపాదికన రెండు పోలీస్‌స్టేషన్లు కొనసాగుతున్నాయి. కానీ కీలకమైన పట్టణాల్లో మాత్రం ఒకటే పోలీస్ స్టేషన్ ఉంటోంది. ముఖ్యంగా పలాస, పాతపట్నం, నరసన్నపేట, ఆమదాలవలస, పైడిభీమవరం, ఎల్.ఎన్.పేట వంటి ప్రాంతాల్లో రెండో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తారని ఎప్పటి నుంచో ప్రచారం జరిగింది. డీజీపీ, డీఐజీ వంటి ఉన్నతస్థాయి అధికారులు వచ్చిన ప్రతిసారి దీనిపై ప్రస్తావన వస్తోంది. కానీ, తరువాత మాత్రం బుట్టదాఖలవుతోంది. జిల్లాలో పెరుగుతున్న నేరాలు, రోడ్డుప్రమాదాల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణపై కూటమి ప్రభుత్వం మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

● డివిజన్ కేంద్రంగా ఉన్నా...

ప్రస్తుతం కాశీబుగ్గ సర్కిల్ పరిధిలో కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు, నందిగాం పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. కాశీబుగ్గ సబ్ డివిజన్ కేంద్రంగా కొనసాగుతోంది. అయితే ఇక్కడ డీఎస్పీ, సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులతో పాటు 50 మంది వరకూ సిబ్బంది ఉండాలి. కానీ అరకొరగా ఉండడంతో విధుల నిర్వహణ కష్టమవుతోంది. జిల్లాలో శ్రీకాకుళం నగరం తరువాత అతి పెద్దది పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ. ఈ జంట పట్టణాల్లో జనాభాతో పాటు వాహన రద్దీ పెరుగుతోంది. నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌తోపాటు పలాస కేంద్రంగా మరో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. కానీ ఇంతవరకూ (మిగతా 4వ పేజీలో..)

వైసీపీ నేత హత్య కేసులో

రాజకీయ కోణం లేదు

● తప్పుడు ప్రచారాలు చేస్తే సహించం: ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



శ్రీకాకుళం క్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి): 'ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటలో ఇటీవల జరిగిన వైసీపీ నేత సత్తారు గోపి హత్య కేసులో ఎటువంటి రాజకీయ కోణం లేదు. ఓ భార్యభర్తల తగాదాలో పెద్ద మనుషులమంటూ రెండు వర్గాలు తాము పంచాయతీ చేస్తామని దూరాయి. ఈ క్రమంలో చోటుచేసుకున్న వివాదం కారణంగానే ఈ హత్య జరిగింద'ని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఘటనపై తప్పుడు ప్రసారాలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. 'ఫరీదుపేటలో 1951 నుంచి గ్రూప్ తగాదాలు ఉన్నాయి. గ్రామంలో కొంతమందిని గుర్తించి 114 కేసులు నమోదు చేశాం. మృతుడు సత్తారు గోపీపై సుమారు పది కేసులు ఉన్నాయి. అతనిపై రౌడీషీట్ కూడా తెరిచి ఉంది. ఓ భార్యభర్తల తగాదా విషయమే ఈ హత్యకు కారణమైంది. ఎంపీపీ మొదలవలస చిరంజీవి దగ్గర పనిచేస్తున్న వ్యక్తి భర్త పక్షాన మాట్లాడగా, భార్య పక్షాన మరికొందరు మాట్లాడారు. ఈ వివాదం పెద్దదై గోపి హత్యకు దారి తీసింది. ఫరీదుపేటకు చెందిన కొంతమంది ఈ హత్యకు పాల్పడినట్టు గుర్తించాం. వారిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇంకా గ్రామంలో తగాదాలకు పాల్పడిన వారిని గుర్తించి రౌడీ షీట్లను తెరుస్తాం. మితిమీరి పోతే పీడీ యాక్టులు కూడా ఓపెన్ చేస్తాం. ఫరీదుపేటను సమస్యాత్మక గ్రామంగా గుర్తించి.. పోలీసు పికెటింగ్ కొనసాగిస్తున్నామ'ని ఎస్పీ తెలిపారు.

రౌడీషీటర్లపై నిఘా

'జిల్లాలో రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఏర్పాటు చేశాం. న్యాయపరంగా రౌడీషీటర్లపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే చర్యలు తీసుకుంటాం. రౌడీషీట్లు మూసివేసిన తర్వాత కూడా కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే.. తిరిగి వారిపై రౌడీషీట్లు తెరిచేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇటీవల నగరానికి చెందిన రౌడీషీటర్ కుంగ్‌ఫూ శేఖర్‌తో శ్రీకాకుళం రెండో పట్టణ కానిస్టేబుల్ త్రినాథరావు ఫోన్ సంభాషణ చేసినట్టు గుర్తించాం. కానిస్టేబుల్ త్రినాథరావును సస్పెన్షన్ చేశాం. శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రాము, కానిస్టేబుల్‌పై కూడా శాఖాపరమైన విచారణ చేపడుతున్నామ'ని ఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు.

వేసవిలా ఎండలు

- పగటిపూట అత్యధిక ఉష్ణోగ్రతల నమోదు
- వర్షాలు ఎగనామం.. ఉక్కపోతతో జనం అవస్థలు
- మధ్యాహ్నం రెండు గంటలకు రోడ్లు నిర్మానుష్యం



వామ్మో.. రోడ్డు మీద ఒక్కరు కూడా లేరు. నేను త్వరగా ఇంటికి చేరుకోవాలి (శ్రీకాకుళంలో)

శ్రీకాకుళం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పేదల ఊటీ శ్రీకాకుళం.. ఇప్పుడు వేసవిని తలపిస్తోంది. జూలై మాసం మధ్యలో కూడాను ఎండవేడిమి తగ్గడంలేదు. కొన్ని రోజుల నుంచి భారీ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత మూడు రోజుల నుంచి పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటిపోతోంది. జిల్లా కేంద్రంలో మండుటెండలో తిరగలేక వాహనదారులు, సాధారణ ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. తలపై వస్త్రం చుట్టుకుని.. గొడుగులు పట్టుకుని ఉపశమనం పొందు తున్నారు. మేనెలలో ఉన్నట్లే.. ఇప్పుడు కూడా చల్లని జ్యూస్‌లు, కొబ్బరి బొండాం విక్రయాలు పెరిగాయి. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం.. భూమి చల్లదనం కాకపోవడం వల్ల ప్రకృతిలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది.

ఏజెన్సీలో మరీ దారుణం..

ఏజెన్సీ జిల్లా సరిహద్దు ప్రాంతాల్లోనూ ఎండ వేడిమి భరించలే నంతగా ఉంటోంది. మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు రోడ్లు జన సంచారంలేక వెలవెలబోతున్నాయి. గిరిజన ప్రాంతాల్లో ఎండలు విరగకాస్తున్నాయి. సోమవారం జిల్లాలో గరిష్ఠంగా 42 డిగ్రీలు కాగా.. కనిష్ఠగాం 24గా నమోదయ్యాయి. రాత్రి ఏడు గంటలు దాటినా సరే భానుడి నుంచి వెలుతురు ప్రభావం పరోక్షంగా ఉంటోంది. దీంతో రాత్రి అవుతున్నా.. సాయంత్రం మాదిరిగానే ఉంటోంది.



వామ్మో.. ఉడికిపోతాం (గొడుగు నీడన కోళ్లు అమ్ముతున్న మహిళలు)



ఏం ఎండలో ఏమో నీడనా ఉండలేకున్నాం (గ్రీవెన్స్ వద్ద వృద్ధుడికి సపర్యలు)



ఈ టైమ్‌లో రిక్షా వేస్తే ఏమైనా ఉందా (సేదదీరుతున్న కార్మికుడు)

రిమ్స్‌లో ఓపీ టోకెనా.. వామ్మో!



అవస్థలు పడుతున్న దివ్యాంగులు, వృద్ధులు



క్యూలో నిల్చోలేక కింద కూర్చున్న మహిళ

శ్రీకాకుళం రిమ్స్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఓపీ టోకెన్ తీసుకోవాలంటే పెద్ద యుద్ధమే చేయాలి. జిల్లా నలుమూలల నుంచి ఇక్కడికి వందలాది మంది రోగులు వారి సహాయకులతో కలిసి వస్తుంటారు. వీరిలో వృద్ధులు, దివ్యాంగులు, నడవలేనిస్థితిలో ఉన్నవారు కూడా ఉంటారు. వారు ఆసుపత్రి ఓపీ కౌంటర్ల వద్దకు వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తోంది. ఆసుపత్రి ఎంట్రన్స్ నుంచి ఓపీ కౌంటర్ల వద్దకు తీసుకువెళ్లేందుకు సరిపడా సిబ్బంది కానీ, వీల్‌చైర్లు కానీ లేవు. ఎలాగోలా ఓపీ కౌంటర్ వద్దకు వెళ్తే అక్కడ చుక్కలు కనిపిస్తాయి. అప్పటికే చాంతాడంత క్యూ ఉంటుంది. రోగుల రద్దీకి సరిపడా ఓపీ కౌంటర్లు లేకపోవడంతో గంటల తరబడి నిల్చోవాల్సి వస్తోంది. జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఆసుపత్రికి రావడం.. కార్పొరేట్ సౌకర్యాలు కల్పిస్తామంటూ ఆర్భాట ప్రకటనలు గుప్పించడం.. తర్వాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది.



ఓపీ టోకెన్ల కోసం ఇలా బారులు..

కొత్త పోలీస్‌స్టేషన్లు ఎప్పుడు?

(మూడో పేజీ తరువాయి)

కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం రెండు పట్టణాలతో పాటు పలాస రూరల్ ప్రాంతానికి ఏకైక పోలీస్‌స్టేషన్ ఉండడంతో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కష్టతరంగా మారుతోంది. ఒకవైపు రైల్వేస్టేషన్, మరోవైపు ఒడిశాలోని గంజాం, గజపతి జిల్లాలకు సరిహద్దున ఉన్న పలాస-కాశీబుగ్గలో మరో పోలీస్‌స్టేషన్ ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం స్పందించి పలాస కేంద్రంగా రూరల్ పోలీస్‌స్టేషన్ కానీ.. కాశీబుగ్గ కేంద్రంగా టౌన్ పోలీస్ స్టేషన్ కానీ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

అర్జీలు పునరావృతం కాకూడదు: జేసీ



వినతులను స్వీకరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం/శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే వినతులు పునరావృతం కాకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. సోమవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావుతో కలిసి ప్రజల నుంచి వచ్చిన 140 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. అర్జీలు రీ-ఓపెన్ కాకుండా అధికారులు స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సమస్యలకు సరైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా వారికి వివరించాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వచ్చిన వినతుల్లో కొన్ని ఇలా..

మా భూమిని ఆక్రమించుకున్నారు..



ఆవేదన వ్యక్తం చేస్తున్న పేద రైతులు

'దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న మా భూములను ఆక్ర మించుకున్నారు. ఇదేమని అడిగితే దౌర్జన్యం చేస్తున్నారు.. అధికారులను ఆశ్రయించినా న్యాయం జరగడం లేదు.. అసలే పేద రైతులం. ఏం చేయాలో పాలుపోవడం లేదు. దయచేసి ఆదుకోండి' అంటూ జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను అంపోలుకు చెందిన కూరమాన మల్లేశ్వరరావు, విభూది రుద్రమణి కోరారు. అంపోలులో ఉన్న తన 2.50 ఎకరాల భూమిని 1977 నుంచి సాగుచేసుకుం టున్నానని, తహసీల్దార్ ఆఫీసులో మామ్మూళ్లు ఇవ్వలేదని, పాస్‌బుక్కులు ఇవ్వకుండా పక్కన పడేస్తున్నారని మల్లేశ్వరరావు ఆవేదన వ్యక్తంచేశారు.

- పిలకపేట సరిహద్దులో 3.24 ఎకరాల భూమి ఉంది. 1957 నుంచి మా కుటుంబీకులే సాగు చేస్తున్నారు.. తన కుమారుడి చదువు నిమిత్తం 2001లో స్థానికంగా ఓ వ్యక్తి వద్ద రూ.50 వేలకు కుదువ పెట్టాను. అప్పు మొత్తం తీర్చేస్తాను...నా భూమి నాకు ఇచ్చేయండని ప్రాధేయపడుతున్నా సరే, ఆ భూమిని అప్పగించడం లేదు. అంతే కాకుండా నకిలీ పత్రాలను చూపించి ఈ భూమి మాదే అంటూ బెదిరిస్తున్నాడని రైతు రుద్రమణి ఆవేదన వ్యక్తంచేశారు. మాకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

పింఛన్ ఇచ్చి ఆదుకోండి..



పెళ్లయిన ఏడాదికే తాను పనిచేస్తున్న ఏడంతస్తుల భవనం పైనుంచి ప్రమాదవశాత్తు కిందట పడిపోయాను. వెన్నుపూస విరిగి పొట్ట పైభాగం నుంచి కింది వరకు పనిచేయడం లేదు. ఏడేళ్లగా మంచంపైనే ఉంటున్నాను. జీవనాధారం లేదు. భార్య కూలీకి వెళితేనే జీవనం. ఇబ్బందులు పడుతున్నాం. నెలవారీ మందుల ఖర్చులు, వైద్యులు సాధారణ దివ్యాంగులకు ఇచ్చే ధ్రువపత్రం ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఛాతీ పైభాగం నుంచి మాత్రమే అవయవాలు పనిచేస్తున్నాయి. పింఛన్ మంజూరు చేసి ఆదుకోండి.

-దివ్యాంగ యువకుడు సూర ప్రసాద్, లుకలాం, నరసన్నపేట మండలం

దివ్యాంగ ధ్రువపత్రం ఉన్నా.. పింఛన్ లేదు..



తాను తీవ్ర అనారోగ్యంతో కాళ్లు, చేతుల కదపలేని స్థితిలో ఉన్నాను. వైద్యులు కూడా 59 శాతం దివ్యాంగ ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. గత 15 నెలలుగా దివ్యాంగ పింఛన్‌కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాను.. ఈ వయసులో, దివ్యాంగుడిగా నేను ఏం కష్టపడగలను. పింఛన్ మంజూరు చేసి ఆదుకోండి.

-చౌదరి అసిరినాయుడు, దివ్యాంగ వృద్ధుడు, గోకర్ణపల్లి, పొందూరు మం.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ప్రజా ఫిర్యాదులు పూర్తిస్థాయిలో పరిష్కరించాలి: ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ గ్రీవెన్స్‌లో స్వీకరించే ప్రజా ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని, ఎటువంటి నిర్లక్ష్యం వహించకుండా విచారణ చేపట్టి అర్జీదారులు సంతృప్తి పొందేలా న్యాయం చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు నమోదు పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా 65 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వినతుల్లో కుటుంబ సమస్యలు, మోసపూరితమైన, ఆస్తి తగాదాలు ఉన్నాయి.

మా పాఠశాలను తరలించొద్దు

- కె .మత్స్యలేశం గ్రామస్థుల వినతి

మా ఊరి పాఠశాలను తరలించి, మా పిల్లల భవిష్యత్‌ను నాశనం చేయవద్దని గార మండలం, కె.మత్స్యలేశం గ్రామానికి చెందిన తల్లిదండ్రులు, విద్యార్థులు కోరారు. ఈ మేరకు జేసీ ఫర్మా టన్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రం అందించారు. 2021లో కేవలం ఎనిమిది మంది మాత్రమే విద్యార్థులుండేవారని, ఇప్పుడు 40 మంది చదువుతున్నారన్నా రు. పాఠశాలల విలీనం పేరుతో 6,7,8 తరగతుల విద్యార్థులను కళింగపట్నం హైస్కూలుకు తరలిస్తే, విద్యార్థులు చదువుకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ 40 మంది విద్యార్థుల వివరాలు కూడా ప్రస్తుతం ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, వారి భవిష్యత్తు ఏం కావాలని ప్రశ్నిస్తున్నారు. గ్రామంలోనే పాఠశాలను కొనసాగించాలని వారు కోరారు.



పాఠశాలను తరలించవద్దంటున్న గ్రీవెన్స్‌కు వచ్చిన కె.మత్స్యలేశం గ్రామస్థులు



ఎల్.ఎన్.పేట: దబ్బపాడు సమీపంలో వాడిపోతున్న వరి ఎదలు

కష్టాల ఖరీఫ్

(మూడో పేజీ తరువాయి)

అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. వంశధార కాలువ ద్వారా సక్రమంగా సాగునీటిని విడుదల చేయాలని కోరుతున్నారు.

- ఎల్.ఎన్.పేట మండలం తురకపేట, కృష్ణాపురం, పొడుగుపడు, బరటాం, దబ్బపాడు, వాడవలస, ధనుకువాడ, మిరియాపల్లి, కోవిలాం, రావిచెంద్రి, చింతలపబడవంజ, చిట్టిమండలం, శ్యామలాపురం, డొంకలబడవంజ, కొత్తపేట, కొమ్ముపలస, బొత్తాడసింగి, జాడుపేట, ఫాక్స్‌దొరపేట తదితర గ్రామాల్లో వరినారు మళ్లు, ఎద పొలాలు ఎండిపోతున్నాయని రైతులు దిగులు చెందుతున్నారు. వంశధార నది కుడి ప్రధాన కాలువ పక్కనే ఉన్నా తమకు సాగునీటి కష్టాలు తప్పడం లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. కుడికాలువ ద్వారా అధికారులు ఇటీవల నీరు విడుదల చేసినా.. దిగువన ఉన్న తమ పొలాలకు రావాలంటే సుమారు వారం పదిరోజుల సమయం పడుతుందని పేర్కొంటున్నారు. ఈలోగా వర్షాలు కురవకపోతే తమకు పంట నష్టం తప్పదని వాపోతున్నారు.

థర్మల్ ఉద్యమం.. చరిత్రలో నిలిచే పోరాటం

(మూడో పేజీ తరువాయి)

గెడ్డగా పేరొందిన ఉత్తరాంధ్రలో పంటలు సస్యశ్యామలంగా పండేలా ప్రణాళికలు రూపొందించాలి. పోలవరం ఎడమ కాలువ ద్వారా నాగావళి, వంశధార, శబరి, తాండవ, కోస్తని, జంఝావతి నదులు అనుసంధానం చేసి నీరందించాలి. ఇందు కోసం పోలవరం డ్యామ్ ఎత్తు 45 అడుగులకు తగ్గకుండా చర్యలు తీసుకోవాలి. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయబోమని ప్రకటించాల'ని కోరారు.

- ప్రముఖ కవి జయరాజ్ మాట్లాడుతూ సోంపేట ఉద్యమంతో పర్యావరణం ప్రాముఖ్యత ప్రతిఒక్కరికీ తెలిసిందన్నారు. భూమిని కాపాడుకొనేందుకు ప్లాస్టిక్ నిషేధించాలని కోరారు. హ్యూమన్ రైట్స్ ప్రతినిధి వీఎస్ కృష్ణ మాట్లాడుతూ సోంపేట ఉద్యమంతోనే మాలాంటి సంస్థలు ప్రజలు ఎన్నో విషయాలు తెలుసుకున్నాయని తెలిపారు. ప్రస్తుతం కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణం పేరిట భూములను పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టే వ్యూహం జరుగుతోందన్నారు. ఎయిర్‌పోర్టు వస్తే.. ఇక్కడ కిడ్నీ వ్యాధులు నశిస్తాయా? అని ప్రశ్నించారు. ఈ ప్రాంతవాసులకు సాగు, తాగునీరు అందించాలని కోరారు. అనంతరం పర్యావరణం పరిరక్షణ కోసం అందరూ ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ పరిరక్షణసమితి అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి, కేవీ జగన్నాథం, బారువ సర్పంచ్ యర్ర రజనీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీపీఎస్సీ పరీక్షలు

(మూడో పేజీ తరువాయి)

చర్యలు తీసుకున్నాం. 743 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల(ఎచ్చెర్ల), శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (ఎచ్చెర్ల), కోర్ టెక్నాలజీస్(నరసన్నపేట), ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(టెక్కలి) కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయి. ప్రతీ కేంద్రంలో బయోమెట్రిక్ ధ్రువీకరణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, పోలీసుభద్రత, వైద్య సహాయం, నిరంతర విద్యుత్తు సరఫరా వంటి ఏర్పాట్లు చేశాం. అభ్యర్థులు ఒరిజినల్ ఫొటో ఐడీ తీసుకురావాలి. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, పేపర్లు వంటి వాటికి అనుమతి ఉండదు. ఉదయం పరీక్షకు 8 నుంచి 8-45 గంటల వరకు, మధ్యాహ్నం పరీక్షలకు 1 గంట నుంచి 1-45 గంటల వరకు అనుమతిస్తాం. ఈ సమయానికి అదనంగా మరో 15 నిమిషాల వెసులుబాటు ఉంటుంద'ని తెలిపారు. ఏపీపీఎస్సీ అధికారులు ఏ.కృష్ణవేణి, ఎం.అమ్మాజీ, రూరల్ సీఐ పైడపునాయుడు, డిప్యూటీ తహశీల్దార్లు ఎస్.బాలకృష్ణ, డి.రామకృష్ణ, పి.నిరంజన్‌కుమార్, కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

గురుకులంలో 18 మందికి జ్వరాలు

పాతపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 18 మంది విద్యార్థినులు వైరల్ జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఇక్కడ జ్వరాలపై ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో హుటాహుటిన డీఎంహెచ్‌వో అనిత చేరుకున్నారు. డీఎంహెచ్‌వో పర్యవేక్షణలో పాఠశాలలో 453 మంది విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేయించినట్లు తహసీల్దార్ నందిగామ ప్రసాదరావు తెలిపారు. వైరల్ జ్వరాలుగా గుర్తించిన 18 మందిలో ఒకరు టైఫాయిడ్, ముగ్గురు ఎక్కువగా జ్వరం తీవ్రతతో బాధపడుతుండడంతో సీహెచ్‌సీలో వైద్యసేవలందిస్తున్నట్లు చెప్పారు. తహసీల్దార్‌తోపాటు ఎంపీడీవో చంద్రకుమారి, గంగువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి శివ, పూర్ణిమలతోపాటు గంగువాడ పీహెచ్‌సీ వైద్యసిబ్బంది వైద్యసేవలు అందించారు. పగటిపూట ఎండతీవ్రత ఉక్కపోత, చల్లని నీరు తాగడం వల్ల జ్వరాల బారినపడ్డారని అధికారులు భావిస్తున్నారు.



వైద్యపరీక్షలను పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌వో అనిత



ప్రత్యేకాలంకరణలతో పాతపట్నం శ్రీ నీలమణిదుర్గ

నేడు నీలమణిదుర్గ ఆవేటి వారోత్సవం

పాతపట్నం జూలై 14 (ఆంధ్రజ్యోతి): పాతపట్నంలో మంగళవారం ఆవేటి వారోత్సవం నిర్వహణకు నీలమణిదుర్గ ఆలయాన్ని ముస్తాబు చేశారు. ప్రతి ఇంటి నుంచి ఘటాలతో అమ్మవారిని దర్శించుకోనున్నారు. పాతపట్నంతోపాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు వచ్చి పూజలుచేయనున్నారు. ఆలయ ప్రాంగణంలో బారికేడ్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటుచేసినట్లు ఈవో వాసుదేవరావు తెలిపారు. వైద్యఆరోగ్య, పోలీస్ శాఖల అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

న్యూస్ బాక్స్

పీఏసీఎస్‌లకు కమిటీల నియామకం

శ్రీకాకుళం, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలాస, కొత్తూరు, సారవకోట పీఏసీఎస్‌లకు చైర్‌పర్సన్‌లను, ఇద్దరేసి వ్యక్తులను పర్సన్‌లుగా నియమించారు. పలాస పీఏసీఎస్‌కు చైర్‌పర్సన్‌గా వంకాల కూర్మారావు, పర్సన్లుగా బొడ్డు దుష్యంత్, రఘుపాత్రుని సుదర్శనరావులను నియమించారు. కొత్తూరుకు చైర్మన్‌గా మాతల గాంధీ, పర్సన్‌లుగా అరుబోలు దశరథ, చోడవరపు రాములు నియమితులయ్యారు. సారవకోటకు చైర్‌పర్సన్‌గా సురవరపు తిరుపతిరావు, పర్సన్లుగా సంపతిరావు మురళీధరరావు, శిమ్మ రామకృష్ణలను నియమిస్తూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి (ఎక్స్‌-అఫిషియో) బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీచేశారు.

ఉపాధ్యాయుడి మృతి

కవిటి, జూలై 14(ఆంధ్రజ్యోతి): శిలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జె.బాబూరావు ఇచ్ఛాపురంలోని స్వగృహంలో ఆదివారం రాత్రి గుండెపోటుకు గురై మృతి చెందారు. ఈయన హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈయన భార్య శ్రీదేవి ఉపాధ్యాయిని. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. బాబూరావు మృతి పట్ల పాఠశాల సిబ్బంది సంతాపం తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులు

కవిటి, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పటిల్ పోటీలకు కవిటి క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో జరిగిన సెలక్షన్ పోటీల్లో అండర్-19 విభాగంలో ఎం.శేషు, అభిరామ్ మొదటి స్థానం సంపాదించారు. ఆగస్టులో విశాఖలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

భద్రాద్రి ఆలయంలో నృత్య ప్రదర్శన

పొందూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఆదివారం తాడివలస పంచాయతీ లత్తయ్యపేటకు చెందిన నృత్యకారిణి ననపల స్నేహాంజలి నృత్యప్రదర్శన చేసింది. 'భద్రాద్రి సాంస్కృతిక వారధి పాహిరామ ప్రభో' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన భరత నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా స్నేహాంజలికి ఆలయ అధికారులు, ధర్మకర్తలు దుశ్శాలువా కప్పి జ్ఞాపిక అందించి అభినందించారు.

అశోక్ గజపతిరాజుకు కలిశెట్టి అభినందన



రణస్థలం, జూలై 14(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజును విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సోమవారం కలిసి అభినందించారు. విజయనగరం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి మిఠాయి తినిపించి అభినందనలు తెలిపారు.

గవర్నర్ పదవిపై హర్షం

పొందూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్‌గా నియమించడంపై ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్, టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. నీతికి, నిజాయతీకి మారుపేరైన అశోక్‌గజపతిరాజు గవర్నర్ పదవికి అన్నివిధాలా అర్హులన్నారు. హర్షం వ్యక్తంచేసిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు కె.సత్యనారాయణ, అన్నెపు రాము, సీపాన శ్రీరంగనాయకులు, బలగ శంకరభాస్కర్ తదితరులున్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

ఆమదాలవలస, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఎరువుల విక్రయాల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. పలు దుకాణాల గోడౌన్లను పరిశీలించారు. ఎరువుల నిల్వలు, రసీదు పుస్తకాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి త్రినాథ స్వామి, ఏడీఏ బగ్గు రజని, ఏవో మెట్ట మోహన్‌రావు పాల్గొన్నారు.

ఆదిత్యనగర్ వాసి అదృశ్యం

శ్రీకాకుళం రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని ఆదిత్య నగర్ కాలనీకి చెందిన గిడుతూరి శివశంకర్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ కె.రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. లైన్ వ్యాపారం చేస్తున్న శివశంకర్ ఆదివాకం డ్వాక్రా నగదు విషయంలో ఇంట్లో భార్యతో గొడవ జరిగింది. దీంతో భార్య పుట్టింటికి నగరంలోని ఆదివారంపేట వెళ్లింది. తిరిగి వచ్చే సరికి భర్త ఇంట్లో లేకపోవడం, ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించింది. భర్త కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. శివశంకర్ మానసికస్థితి సరిగా లేకపోవడంతో చికిత్స కూడా తీసుకున్నట్లు భార్య తెలిపింది. ఇంట్లో ఉన్న ద్విచక్ర వాహనం తీసుకుని బయటకు వెళ్లి వెళ్లాడని ఆ ఫిర్యాదులో పేర్కొంది. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యమా?

- ఇలాగే వ్యవహరిస్తే సస్పెండ్ చేయిస్తా
- ఎమ్మెల్యే రవికుమార్ హెచ్చరిక
- వాడీవేడిగా మండల సమావేశం



ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడం ఎంతమాత్రం సమంజసం కాదని, ఇలాగే వ్యవహరిస్తే సంబంధిత ఉద్యోగులను సస్పెండ్ చేయాల్సి వస్తుందని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ హెచ్చరించారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ తమ్మినేని శారదమ్మ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత వంశధార, ఇరిగేషన్ శాఖలకు సంబంధించిన చర్చ ప్రారంభించారు. వంశధార, పలు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు సక్రమంగా రావడం లేదని పలువురు సర్పంచ్‌లు, ఎంపీ టీసీ సభ్యులు పేర్కొన్నారు. దీనిపై ఎమ్మెల్యే జోక్యం చేసుకుని ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటి వన రులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని, ఈ ఏడాది పూర్తిస్థాయిలో నిధులు రప్పించి సాగునీటి వనరులను యథాస్థితికి తీసుకువస్తామన్నారు. అయితే ప్రతి ఎకరాకు సాగునీరందించాల్సిన బాధ్యత ఇంజనీరింగ్ అధికారులపై ఉందని, రైతులు నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వ్యవసాయశాఖపై జరిగిన చర్చలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సచివాలయాల వ్యవసాయ సహాయకులు సకాలంలో ఎరువులు ఇవ్వడం లేదని తన దృష్టికి వచ్చిం దన్నారు. తొగరాం గ్రామ సచివాలయ వ్యవసాయ రైతుల నుంచి ఎరువులకు నగదును వసూలు చేసినట్లు ఎమ్మెల్యే దృష్టికి పలువురు సభ్యులు తీసుకురాగా తక్షణం సదరు ఉద్యోగిపై విచారణ చేపట్టి జేడీఏకి పంపాలని ఏవో మెట్ట మోహనరావును ఆదేశించారు. గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులు రాజకీయ ధోరణితో తప్పుడు ప్రచారాలు వీడి అన్నిశాఖల అధికారుల ద్వారా పూర్తి విషయం తెలుసు కుని ప్రజలకు వివరిస్తే బాగుంటుందని అన్నారు. సమావేశంలో ఎంపీడీవో రేణంకి వెంకటరావు, జడ్పీటీసీ బెండి గోవిందరావు, ప్రత్యేక ఆహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి: శంకర్

పాత శ్రీకాకుళం, జూలై14 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత లక్ష్యసాధన దిశగా చిత్తశుద్ధితో కష్టపడి పని చేస్తే విజయం వరిస్తుందన్నారు. సుమారు 10 ప్రైవేటు కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొన్నాయని, యువత ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయి కుమార్ మాట్లాడుతూ.. జాబ్‌మేళాలో అవకాశం పొందిన వారు ఉద్యోగంలో చేరి కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు రెడ్డి గిరిజా శంకర్, టీడీపీ బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఉంగటి రమణమూర్తి, వివిధ కంపెనీల ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

క్రీడలకు పూర్వ వైభవం

శ్రీకాకుళం రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): క్రీడలకు పూర్వవైభవం తీసుకువస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. చింతాడలో క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు సోమవారం బహుమతులు అందించారు. నేతలు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని కాపాడుకోవాలి: ఎన్ఈఆర్



డీఆర్‌వలసలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మత సామరస్యాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. డీఆర్ వలస శివాలయం ఆవరణలో నవగ్రహ విగ్రహాల ధ్వంసం ఘటనా ప్రదేశాన్ని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతితో కలిసి సోమవారం పరిశీలించారు. ధర్మాన్ని కాపాడటానికి ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. దేవాలయాలపై ఇటువంటి ఘటనలను సాధుపరిషత్ ఖండిస్తుందని శ్రీనివాసానంద అన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమరాపు రవికుమార్, అప్పన్న, కూర్మారావు, ఆదినారాయణ జగన్నాథరావు పాల్గొన్నారు.

వెంకటేష్ కుటుంబానికి పరామర్శ

ఇటీవల తెలంగాణా రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పాశమైలం సిగాచి కంపెనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన పాలఖండ్యాం పంచాయతీ జగన్నాథపురానికి చెందిన గుండుబిల్లి వెంకటేష్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఎన్ఈఆర్ పరామర్శించారు. ఈ ఘటనలో వెంకటేష్ మృతి చెందడం విషాదకరమని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇబ్బందులు

మెట్టవలస పంచాయతీ పాల ఖండ్యాం కూడలి వద్ద నివాసాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని స్థానికులు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన ఆయన తన మొబైల్‌లో ఆ ట్రాన్స్‌ఫార్మర్ ఫొటోను తీసి విద్యుత్ శాఖాధికారులకు పంపి తక్షణం దానిని వేరే చోటికి తరలించాలని సూచించారు.

పలాస జీడి పప్పునకు 'జాతీయ అవార్డు'

- కేంద్ర మంత్రులు, ఢిల్లీ సీఎం నుంచి అవార్డు అందుకున్న కలెక్టర్


శ్రీకాకుళం, జూలై 14(ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం జిల్లా ప్రతిష్ఠను దేశవ్యాప్తంగా చాటి చెబుతూ పలాస జీడిపప్పు వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ (ఓడీఓపీ) కింద ఉత్తమ ఉత్పత్తిగా ఎంపికై జాతీయ అవార్డును పొందింది. ఈ మేరకు ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ అవార్డును కేంద్ర పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా, కేంద్ర వస్త్రోత్పత్తుల మంత్రి జితిన్ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ మంత్రి ఎస్.సవితల చేతుల మీదుగా అందుకున్నారు. జిల్లా ఉద్యానవన అధికారి ప్రసాదరావు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. 'తితలీ తుఫాన్ తీవ్రంగా నష్టపరిచినా.. అదే ఓ మలుపుగా మారింది. పునరుద్ధరణ చర్యలు, అధిక దిగుబడినిచ్చే జాతుల ప్రోత్సాహం. ఉపాధి హామీ పథకం వినియోగంతో సాగు విస్తరించింది. జీడిపప్పు ప్రాసెసింగ్ పరిశ్రమలకు కొత్త దిశ చూపగలిగాం. ఇది రైతుల కృషికి, అధికార యంత్రాంగ ప్రణాళికా బద్ధమైన కార్యాచరణకు లభించిన గుర్తింపు' అని పేర్కొన్నారు.

మంత్రి అచ్చెన్న అభినందన

రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ సందర్భంగా స్పందిస్తూ.. 'రైతుల సంకల్పం, అధికారుల కృషి కలిసి ఓ గొప్ప విజయాన్ని సాధించాయి. ఇది రాష్ట్ర ఉద్యాన రంగానికే మైలురాయిగా నిలుస్తుంది' అని ప్రశంసించారు.

ఆగస్టు 22న 'యూనివర్సిటీ' విడుదల

- సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి



సోంపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యారంగంపై యూనివర్సిటీ (పేపర్ లీక్) పేరుతో సినిమా తీశామని, దీనిని ఆగస్టు 22న విడుదల చేయనున్నట్లు సినీ నటుడు, దర్శకుడు ఆర్.నారా యణమూర్తి తెలిపారు. సోమ వారం బారువలో విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో విద్యావ్యవస్థ ప్రభుత్వం చేతుల నుంచి కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిపోతోందని, ఈ నేపథ్యంలో విద్యావ్యవస్థలోని లోపాలపై ఈ సినిమా తీశామన్నారు. కార్పొరేట్ సంస్థలు తమ కళాశాల, యూనివర్సిటీలో మాత్రమే ర్యాంకులు వస్తున్నాయని ప్రకటనలు గుప్పిస్తూ తల్లిదండ్రుల వద్ద నుంచి దోచుకుంటున్నాయన్నారు. మాస్ కాపీయింగ్ ద్వారా మంచి మా ర్కులు సాధించిన విద్యార్థులు ఉద్యోగులుగా ఎంత వరకు న్యాయం చేయగలరని అని ప్రశ్నించారు. ఈ సమస్యలను ఎత్తి చూపుతూ ఈ సినిమాను తీశా మన్నారు. విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని, ఇది అమెరికా, జపాన్‌పై వేసిన అణు బాంబు కంటే అత్యంత ప్రమాదకరమైందన్నారు.

దేశం గర్వించదగ్గ సాహితీవేత్త 'గరిమెళ్ల'



గరిమెళ్ల విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): 'మాకొద్దీ తెల్లదొరమంటూ ఎలుగెత్తి చాటి దేశ స్వాతంత్ర్య కాంక్షను రగిల్చిన స్వాతంత్ర్య సమర యోధుడు గరిమెళ్ల సత్యనారాయణ దేశం గర్వించదగ్గ సాహితీవేత్త అని తెలుగు రచయితల వేదిక అధ్యక్షుడు ఉత్తరావిల్లి నాగేశ్వరరావు అన్నారు. గరిమెళ్ల సత్యనారాయణ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక న్యూ బ్రిడ్జి రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రఘుపాత్రుని వెంకట రమణమూర్తి, వావిలపల్లి రాజారావు, డా.బి.కోమల రావు, పూడి జనార్దనరావు పాల్గొన్నారు.

బీఆర్ఏయూలో..

ఎచ్చెర్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ ప్రజాకవి గరిమెళ్ల సత్యనారాయణ జయంతిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. గరిమెళ్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ, వర్సిటీ అకడమిక్ విభాగం డీన్ డాక్టర్ కె.స్వప్నవాహిని, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం(శ్రీకాకుళం) ప్రతినిధులు పాల్గొన్నారు.

సమాజ పోకడలపై సోషల్ మీడియా తీవ్ర ప్రభావం



ప్రొఫెసర్ కేఆర్ రజని, రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ, ఎన్.సంతోష్ రంగనాథ్, పి.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): సమాజ పోక డలపై సోషల్ మీడియా తీవ్ర ప్రభావం చూపుతోం దని, 2018-19లో 370 ఆర్టికల్ రద్దుతో కశ్మీర్‌లో ఇంటర్నెట్ వాడకం పెరిగిందని కాశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ కమ్యూనికేషన్, జర్నలిజం విభాగం అధ్యాపకుడు డాక్టర్ కె.జాన్ బాబు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ రీసెర్చ్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం లెక్చర్ సిరీస్ సమావేశం నిర్వహించారు. కార్య క్రమంలో వీసీ

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

లావేరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బెజ్జిపురం గ్రామానికి చెందిన సబ్బి శివాజీ (52) బెజ్జిపురం జంక్షన్ సమీపంలో హైవే టాయిలెట్స్ కాంప్లెక్స్‌లో పని చేస్తూ ఆదివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రాత్రి మా నాన్నకు భోజనం తీసుకుని వెళ్లేసరికి బాగానే ఉన్నాడని, తీరా సోమవారం ఉదయానికి తాను విధులు నిర్వహిస్తున్న టాయిలెట్ కాంప్లెక్స్ వద్ద శవమై ఉండడంతో కుమారుడు శామ్యూల్ వాపోయాడు. భర్త మృతితో భార్య ఆదిలక్ష్మి, మరో కుమారుడు పవన్ కల్యాణ్ బోరున విలపిస్తున్నారు. శ్యామ్యూల్ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ భుజంగరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నైపుణ్యంతో మెరుగైన ఉపాధి

ఎచ్చెర్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): నైపుణ్యం పెంపొందించుకోవడం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. కళాశాలలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్, ఐసీటీ అకాడమీ సంయుక్తంగా 15 రోజుల పాటు 'ఫినిషింగ్ స్కూల్ ఆఫ్ ఎంప్లాయిబిలిటీ' అంశంపై నిర్వహించనున్న శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభ మయ్యాయి. కార్యక్రమంలో ఐటీసీ అకాడమీ (చెన్నై) ప్రాజెక్ట్ హెడ్ ఇ.దినేష్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ (బెంగుళూరు) ట్రైనర్ శశికాంత్, వైస్ ప్రిన్సిపాల్ జీటీ చంద్రశేఖర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీఎస్ సునీల్‌కుమార్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఆదిత్యాలయంలో వేలంపాట ఖరారు

అరసవల్లి జూలై 14(ఆంధ్రజ్యోతి): అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో వాహనాల పార్కింగ్, చెప్పుల స్టాండ్ నిర్వహణకు గాను వేలంపాట ఆలయ అనివెట్టి మండపంలో సోమవారం నిర్వ హించారు. ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలంలో వాహనాల పార్కింగ్‌కు రూ.2.05 లక్షల కు, చెప్పుల స్టాండ్‌కు రూ.2.19 లక్షలకు టెండర్లను ఖరారు చేశారు. రావివలస ఈవో గురు నాథరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఇచ్ఛాపురం, జూలై14(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధి 11వ వార్డులో రోడ్లు, కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తగుచర్యలు తీసుకోవాలని స్థానిక కౌన్సిలర్ ఆశి లీలారాణికోరారు. ఈ మేరకు రామయ్యపుట్టుగలో ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కలిసి వినతి పత్రం అందించారు. గౌడ వీధి, రంగాలవీధి, కస్పాకాలనీలో కాలువల నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కృష్ణాజిల్లా జడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి దారుణం

ఇచ్ఛాపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా జడ్పీ చైర్మపర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన నేతల దాడి దారుణమని, దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని వైసీపీ నాయకులు కోరారు. అనంతరం తహసీల్దార్ ఎన్.వెంకటరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, నేతలు పిరియా సాయిరాజ్, శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉలాల భారతి దివ్య పాల్గొన్నారు.

18 గేదెలు పట్టివేత

రణస్థలం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రామతీర్థం జాతీయ రహదారిపై సోమవారం వాహనంలో తరలిస్తున్న 18 గేదెలను పట్టుకున్నట్లు జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. వాహనాల తనిఖీ సమయంలో ఎటువంటి అనుమతులు లేకుండా వ్యాన్‌లో 18 గేదెలను తెలంగాణ తర లిస్తూ ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. ఈ గేదెలను గోశాలకు తరలించి, ముగ్గురిపై కేసు నమోదు దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

నేడు కలెక్టరేట్ వద్ద 'పెన్షనర్ల' ధర్నా

శ్రీకాకుళం అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రోణంకి రామ చంద్రరావు, ప్రధాన కార్యదర్శి అంకం ధర్మారావు, ప్రతినిధి శాంతారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్‌తో పాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వ్యాలిడేషన్ అమైండ్‌మెంట్‌ను రద్దు చేయాలని, ఎన్‌పీఎస్, యూపీ విధానాలను రద్దు చేయాలన్న ఏడు ప్రధాన డిమాండ్ల సాధన కోసం ఈ ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని పెన్షనర్లు పాల్గొనాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, శ్రీకాకుళం : 9985411535
రాజాం : 9494691912, పలాస : 9985411532

నిరుద్యోగ భృతి ఇవ్వకుంటే ప్రత్యక్ష ఆందోళన

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి ఇవ్వకుంటే ప్రతక్ష ఆందోళన తప్పదని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక జడ్పీ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలోని లక్షలాది నిరుద్యోగుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణు, వసంతరావు, అన్నాజీ, రామోజీ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

శ్రీకాకుళం క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి):ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట వద్ద వైసీపీ నేత సత్తారు గోపి హత్య ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కోరారు. ఈ మేరకు సోమవారం ఎస్పీ మహేశ్వరరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, పేరాడ తిలక్,చింతాడ రవికుమార్ తదితరులున్నారు.

'మధ్యవర్తిత్వం-దేశంకోసం' సద్వినియోగం చేసుకోండి

- జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బి.జ్యోత్స్న

పొందూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజలకు.. ముఖ్యంగా కక్షిదారులకు వేగవంతమైన న్యాయం అందించేందుకు సుప్రీంకోర్టు చేపట్టిన 'మధ్యవర్తిత్వం-దేశంకోసం' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పొందూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బి.జ్యోత్స్న కోరారు. స్థానిక కోర్టు సమావేశ మందిరంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల ఒకటో తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమం సెప్టెంబరు 30వ తేదీ వరకు 90 రోజుల పాటు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కక్షిదారులు పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. దీనివల్ల డబ్బు, సమయాన్ని కాపాడుకుని మనశ్శాంతిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కేసుల సత్వర పరిష్కారం కోసం న్యాయవాదులు కె.అశోక్, వై.బ్రహ్మాజీ, పి.రామ్మోహన్‌లను నియమించడం జరిగిందన్నారు. ప్రతీ సోమవారం, శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, దీనిని వినియోగించుకోవాలని కోరారు.

లోకాయుక్తలో ఫిర్యాదుపై భూ సర్వే

జి.సిగడాం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సర్వే నెంబరు 92/8 భూమిని కొందరు ఆక్రమించి కల్యాణ మండపం నిర్మాణం చేపట్టారని, వాటిని తొలగించాలని గ్రామానికి చెందిన పి.జగదీశ్వ రరావు ఇటీవల లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ఏలూరు లోకాయుక్త అధికారి ఆదేశాలతో మండల రెవెన్యూ అధికారులు భూమిని పరిశీలించారు. అయితే మండల సర్వేయర్ సర్వే బాగులేదని, జిల్లా సర్వేయర్‌తో చేయించాలని ఫిర్యాదుదారు కోరారు. స్టేట్‌మెంట్‌లను రికార్డు చేశారు. నివేదికలను అధికారులకు అందిస్తామని తహసీల్దార్ సరిత తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు M/s SHRIRAM FINANCE LIMITED శ్రీకాకుళం బ్రాంచి-IIవారు ఇచ్చిన బోగట్టా ప్రకారము యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తిని రిజిస్టరు తనఖా చేయించుకొని శ్రీ/శ్రీమతి రాజ్ పురోహిత్ సూరమ్మదేవి W/o రాజ్ పురోహిత్ వరదరాజ్ వీరి ప్రాపర్టిని షూరిటీగా తీసుకొని వీరికి ఋణము యిచ్చుటకు నిర్ణయించుకొన్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి అప్పులు, చార్జీలు, క్లయిములు, తనఖాలు, అగ్రిమెంటు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న ఎడల నేటి నుండి ఏడుదినములలో ఈక్రింది చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియచేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు: శ్రీకాకుళం జిల్లా, పొందూరు సబ్.డి., ఎచ్చెర్ల మండలం, ఎచ్చెర్ల గ్రామ పంచాయితీ, ఎచ్చెర్ల గ్రామ రెవెన్యూ లెక్కదాఖలా గల సర్వే నెం. 124-7రు, సర్వే నెం.124-7బి మొత్తం విస్తీర్ణం 919.6చ.గ.లు లేక 768.90చ.మీ.లు గల ఖాళీ స్థలమునకు హద్దులు: ఉత్తరం: ఎన్.హెచ్.16రోడ్డు, దక్షిణం: ఎచ్చెర్ల రెవెన్యూ గ్రామం సర్వే నెం.124-8రు, తూర్పు: ఆంధ్రజ్యోతి ప్రైస్ వారి ప్రహారీగోడ, పడమర: ఎచ్చెర్ల గ్రామ రెవెన్యూ గ్రామం సర్వే నెం.124-5, 4, 3, ఇవర్లు.

టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం
సెల్: 9247315759

APS RTC పల్లె వెలుగు

టెండరు ప్రకటన

[illegible]

నెం. P2/437(03)/2025-DPTO/SKLM, తేది:11-07-2025 — సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, శ్రీకాకుళం.

ఆమదాలవలస పురపాలక సంఘం
ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండర్ నోటీసు

రేఖా నెం: 284/2025/ఇ1 — తేది: 14.07.2025.

ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలో ఈ దిగువ తెలిపిన పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు కోరబడుచున్నవి.

BPS-2019 & LRS-2020	1	అంచనా కాంట్రాక్ట్ విలువ: 9,22,179/-
1	బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేయుటకు ప్రారంభ తేది:	15.07.2025 ఉ.గం.11.00లకు
2	బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేయుటకు ఆఖరు తేది:	18.07.2025 మ.గం.1.00లకు
3	బిడ్ స్వీకరించుటకు ఆఖరు తేది:	18.07.2025 మ.గం.3.00లకు
4	బిడ్ తెరుచు తేది:	18.07.2025 సా.గం.4.00లకు

ఇతర వివరములకు ఆఫీసు పని వేళల్లో సంబంధిత విభాగ అధికారులను సంప్రదించి తెలుసుకొనవచ్చును.

సం/- కమీషనరు, ఆమదాలవలస పురపాలక సంఘము.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్ 2),భవనం సంఖ్య 02,ఔరం క్యూ పార్క్,జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న ఋణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీపై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన ఋణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలంపాటను మేము వేలం వేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని ఋణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని ఋణగ్రహీత నుండి చట్టపరమైన చర్యల ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

AUCTION DATE 22.07.2025,SHRIRAM FINANCE LTD.D.no2-216/A,1ST FLOOR,OLD NH5 ROAD,UPSTAIRS BANK OF INDIA,TEKKALI,SRIKAKULAM -532201

AGMT NO	Customer Name	AGMT NO	Customer Name
PALSAPJ2501230004	SORRA KUMARI	TEKKAPJ2501130007	NARASIMHA MURTHY SEEPANA
GPATMPJ2501020001	ANDAVARAPU MURALI	TEKKAPJ2501130008	NARASIMHA MURTHY SEEPANA
GPATMPJ2501130004	KANTHARAO MAVIDI	TEKKAPJ2501220002	SIMHACHALAM JARUMUDI
GPATMPJ2501230003	THOWDU SIGIRIVALASA		
GPATMPJ2410280001	TIRUPATHI JENNA		
TEKKAPJ2501220001	JARUMUDI SRINIVASA RAO		

AUCTION DATE 22.07.2025,SHRIRAM FINANCE LTD,ZONAL OFFICE,D.NO 4000A/47,FIRST FLOOR,SARASWATHI COMPLEX,BAKARSAHEB PETA,SRIKAKULAM-532001,

AGMT NO	Customer Name	AGMT NO	Customer Name
AMDVSPJ2501200001	KRISHNA MAJJI	SRKL2PJ2501080003	GURUNADHA RAO KADUPU
AMDVSPJ2410210002	APPANNA GONDELA	SRKL2PJ2501200004	KATAKAM SRIKANTH
AMDVSPJ2501220002	KRISHNA MAJJI	SRKL2PJ2501200003	KATAKAM SRIKANTH
SRKL2PJ2501040009	APPALACHARI VOMARAVILLI	SRKLMPJ2502010002	PAVAN KALYAN MURAPALA

వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ పి.రవి కిరణ్ ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. ఖాతాదారు మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 14.07.2025 — అధీకృత అధికారి
స్థలం:శ్రీకాకుళం — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్



ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు

● జిల్లా వ్యాప్తంగా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం



హరిపురం: బాహాడపల్లిలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహిస్తున్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



ఎల్.ఎన్.పేట: పూశాంలో కరపత్రం అందజేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి



పోలాకి: సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ ఉత్తరాంధ్ర జోనల్ కోర్డినేటర్ పెళ్లకూరు శ్రీనివాసులరెడ్డి, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలుచేస్తోందని టీడీపీ నాయకులు తెలిపారు. ప్రతిఒక్కరికీ సంక్షేమపథకాలు అందుతున్నాయని చెప్పారు. సోమవారం జిల్లాలోని పలుచోట్ల తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కరపత్రాలు అందజేసి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం టీడీపీ నాయకులు మాట్లాడుతూ సూపర్‌సిక్స్ కార్యక్రమాల్లో భాగంగా సామాజిక పింఛన్లు పెంపుదల, తల్లికి వందనం కార్యక్రమాలను అమలు చేసినట్లు తెలిపారు. ఉచిత గ్యాస్ పంపిణీ చేపట్టామన్నారు.మహిళలకు ఉచిత బస్సు ఆగస్టు 15న ప్రారంభమవుతుందన్నారు. -ఆంధ్రజ్యోతి బృందం



ఆమదాలవలస: మునిసిపాలిటీలోని గేటు ప్రాంతంలో పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్



అరసవల్లి: శ్రీకాకుళంలో మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

కక్షతోనే దేవుడి విగ్రహాల ధ్వంసం

● డీఆర్‌వలస గ్రామస్థుడు అరెస్టు: ఎస్పీ మహేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): దేవుడిపై కక్ష పెంచుకొని విగ్రహాలు ధ్వంసంచేసిన వ్యక్తిని అరెస్టుచేసినట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు.జిల్లా పోలీసుకార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జి.సిగడాంమండలం డీఆర్‌వలసలో అదే గ్రామానికి చెందిన వేముల రామకృష్ణ ఈఘటనకు పాల్పడినట్లు గుర్తించామన్నారు.రామకృష్ణ కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. నిత్యం మద్యం సేవించి దేవునిపై దూషణలకు దిగుతున్నాడని, ఈ నేపథ్యంలోనే శివాలయంలో నవగ్రహాల విగ్రహాలను ధ్వంసంచేసినట్లు పోలీసు దర్యాప్తులో తేలిందని చెప్పారు. రామకృష్ణ భార్యకు పురిటిలోనే ఒక బిడ్డ చనిపోగా మరో బిడ్డ కూడా సహజమరణం చెందడంతో తన కుటుంబానికే దేవుడే ఇటువంటి శిక్షలు విధిస్తున్నాడని పదే పదే గ్రామంలో శివుడిని ద్వేషిస్తూ తిరుగుతుండేవాడని తెలిపారు.ఈనేపథ్యంలో ఈనెల 11వతేదీ రాత్రి మద్యం సేవించి తనతో తెచ్చుకున్న రాడ్డుతో నవగ్రహవిగ్రహాలను ధ్వంసం చేశాడన్నారు. 2022లో శివాలయంలో పూజారి జగదీశ్వరరావు.. రామకృష్ణతో నిత్యం మద్యం సేవిస్తూ ఉండడంతో గ్రామస్థులు అతనిని తొలగించారని, అయితే అనంతరం గ్రామపెద్దలతో సంప్రదించి మళ్లీ అదేఆలయంలో పూజారిగా పనిచేస్తున్నాడని,అయితే రామకృష్ణ చేసిన విగ్రహాల ధ్వంసంలో జగదీశ్వరరావుకు ఎటువంటి సంబంధం లేదని విచారణలో తేలిందని ఎస్పీ తెలిపారు. నగరంలో జరిగిన తెలుగు బాప్టిస్ట్ చర్చి గోడపై శివుడికి సంబంధించిన రాతలు రాసిన వ్యక్తిని వెంటనే అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

బంగారం తాడు తెంపిన వ్యక్తి అరెస్టు

శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి హయాతినగర్, బాలాజీనగర్ వద్ద ఈనెల తొమ్మిదో తేదీన వృద్ధురాలిపై దాడిచేసి ఆమె గొంతును పట్టి బలవంతంగా మెడలోని బంగారు తాడును తెంపిన ఘటనలో నిందితుడు జీరు సురేష్‌ను ఆదివారం వెంకటాపురం సింహద్వారం వద్ద అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 35.70 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. సురేష్ చెడువ్యసనాలకు బానిసై అప్పులు చేసి వాటిని తీర్చలేక దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. బాలాజీనగర్‌లో పొడుగు అరుద్రమ్మ తనఇంటిలో ఒంటరిగా ఉండడాన్ని గమనించిన సురేష్ ఇంటిలోకి ప్రవేశించి మంచినీరు కావాలని అడిగి ఆమె వెనక్కు తిరిగేసరికి దాడిచేసి కొట్టి చంపుతామని బెదిరించి.. మెడలోఉన్న రెండు వరుసల బంగారు తాడును తెంపి పారిపోయినట్టు వివరించారు. మేలో కూడా పీఎన్‌కాలనీలో జీరుసురేష్ తన స్నేహి తునితో కలిసి ఓ ఇంటిలోకి దూరి ఎలక్ట్రికల్ సామాన్లు, టీవీ, బంగారు ఆభరణాలు, రూ.50 వేలు నగదు దొంగలించినట్టు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. సురేష్‌ను అరెస్టు చేసి అంపోలు జిల్లా జైలుకు తరలించినట్టు ఎస్పీ వివరించారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి (ఫైల్)

శ్రీకాకుళం క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి సోమవారం మృతి చెందినట్లు ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట సుధాకర్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. నగరంలోని ఏ1 హోటల్ వద్ద బాలాజీ మెడికల్ షాపు ఎదురుగా రోడ్డు పక్కన నిద్రపోతున్న ఓ వ్యక్తిపై నుంచి కారు దూసుకుపోవడంతో గుర్తుతెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంమేరకు అతడిని 108లో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్టు సుధాకర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఆలయం ప్రహరీ తొలగింపుపై కేసు నమోదు

నరసన్నపేట, జూలై14(ఆంధ్రజ్యోతి):నరసన్నపేట పెద్దపేటలోగల పురాతన ఆంజనేయస్వామి ఆలయ స్థలాన్నిపరిరక్షించాలని ఆలయధర్మకర్త పొట్నూరు కృష్ణప్రసాద్, పురోహితులు, భక్తులు కోరారు. ఈ మేరకు సోమవారం ఆలయానికి చెందిన స్థలంలో నిర్మాణాలను తొలగించాలని ఎస్పీ మహేశ్వర రెడ్డికి ఫిర్యాదుచేశారు. ఆలయం ప్రహరీ శిథిలావస్థకు చేరడంతో భక్తుల విరాళాలతో నిర్మిస్తుండగా సాకలివీధికి చెందిన కొందరు యంత్రాలతో పిల్లర్లు తొలగించి, ప్రశ్నించే వారిపై దాడిచేసేందుకు ప్రయత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా పెద్దపేట ఆంజనేయస్వామి ఆలయ ప్రహరీ నిర్మాణం జరుగుతున్న సమయంలో గొండు ప్రసాద్, భాస్కరరావు, చందులు యంత్రంతో తొలగించడంపై ఎస్పీకు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

ఉర్లాం పాఠశాలలో చోరీ

నరసన్నపేట, జూలై14(ఆంధ్రజ్యోతి): ఉర్లాం ప్రాథమిక పాఠశాలలో ప్లంబింగ్ సామగ్రి చోరీ గురైనట్లు హెచ్ఎం భారతి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల నాడు-నేడు పనుల్లో భాగంగా పాఠశాలలో గల మరుగుదొడ్లకు నీటిపైపులు, ఇతర సామగ్రి బిగించారు. ఈ నేపథ్యంలో జాగర్ కంపెనీకి చెందిన ట్యాప్‌లు, బేసిన్లు, పైపులు చోరీకి గురికావడంపై హెచ్ఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పాఠశాలను పోలీసులు పరిశీలించారు.

బుడితి పంచాయతీ కార్యదర్శిపై దాడి

నరసన్నపేట, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావాడపేట వద్ద ద్విచక్రవాహనంపై విధులకు వెళ్తున్న పోలాకి మండలంలోని జడూరుకు చెందిన బుడితి పంచాయతీ కార్యదర్శి డొంకాన శ్రీనివాసరావుపై జమ్ముకు చెందిన రుప్ప రాజారావుతోపాటు కొందరు దాడికిపాల్పడినట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రుప్ప రాజారావు కుటుంబసభ్యులపై దురుసుగా ప్రవర్తించడంతో ఆయన దాడికి పాల్పడినట్లు చెప్పారు.ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోటబొమ్మాళి, జూలై 14 (ఆంధ్రజ్యోతి):మండలంలోని జాతీయ రహదారి పొడుగుపాడు సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమదాలవలసకు చెందిన ఎం.నాగమణి, టెక్కలిమండలం విక్రంపురం గ్రామానికి చెందిన లక్ష్మీప్రసాద్ గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. లక్ష్మీప్రసాద్ నరసన్నపేట నుంచి ద్విచక్రవాహనంపై టెక్కలి వైపు వస్తున్నాడు. పొడుగుపాడుసమీపంలో రోడ్డుపక్కన ఆగిఉన్న ఆటోను వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో ఆటోలోఉన్న నాగమణికి, లక్ష్మీప్రసాద్‌కి గాయాలయ్యాయి. వీరికి స్థానిక 108లో నరసన్నపేటలోని ఓప్రైవేటు ఆసుపత్రికితరలించారు. ఈ మేరకు స్థానిక ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదుచేశారు.

పశువుల అక్రమ రవాణా కేసు నమోదు

నందిగాం, జూలై 14(ఆంధ్రజ్యోతి): సోంపేట నుంచి అక్రమంగా పశువులు తరలిస్తున్న రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ షేక్‌మహ్మద్ ఆలీ తెలిపారు. సోమవారం నందిగాం జాతీయరహదారిపై సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో రెండు లగేజీ వ్యాన్లలో మార్పు సందీప్, తిమిరి దేవరాజ్‌లు తొమ్మిది, నాలుగు పశువులు చొప్పున అక్రమంగా తిలారుకు తరలిస్తుండగా తనిఖీల్లో పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి పశువులను కొత్తవలసగోశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

వంశధార ఎడమ కాలువ గట్టుకు గండి

హిరమండలం, జూన్14(ఆంధ్రజ్యోతి): గొట్టాబ్యారేజీ ఎడమ ప్రధాన కాలువకు మళ్లీ గండిపడింది. ఈనెల రెండోతేదీన నీరు విడిచిపెట్టిన తర్వాత రెండసారి గండి పడడంతో వంశధారఅధికారులు తలలుపట్టుకుంటున్నారు. సోమవారం ఉదయం మండలంలోని పింద్రువాడకాలనీ సమీపంలో 5ఆర్ స్లూయిస్ వద్ద గట్టుకు గండి పడి పంటపొలాల్లో నీరుచేరడంతో రైతులు గుర్తించారు. వెంటనే వంశధార అధికారులలకు సమాచారం అందించారు.గొట్టాబ్యారేజీ ఈఈ మురళీమోహన్,ఏఈఈ ధనుంజయరావుతోపాటు సిబ్బందిగండిపడిన ప్రదేశానికి చేరుకొని పరిశీలించారు. స్లూయిస్ పక్క నుంచి రంధ్రం ఏర్పడడంతో గట్టులోపలికి నీరు ప్రవహించింది.క్రమేపి గట్టు మొత్తం కోరుకుపోయింది.ఈవిషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతోవారి ఆదేశాల మేరకు కాలువలో నీటివిడుదలను నిలిపివేశారు.గండిపూడ్చే పనులు యుద్ధప్రాతిపాదిక చేప ట్టారు. కాగా ఎడమ కాలువ గట్టుకు గండి పడిన ప్రదేశానికి దగ్గరలోనే మరో స్లూయిస్ వద్ద గట్టుకు రంధ్రం ఏర్పడింది.వంశధార ఈఈ దీన్ని గుర్తించి గండిపడకముందే మరమ్మతులు చేపట్టాలని ఏఈకి ఆదేశించారు.ఈ పనులను మంగళవారం చేపట్టనున్న ట్లు అధికారులు తెలిపారు. కాగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సోమవారం సాయంత్రం 500 క్యూసెక్కుల నీటిని కాలువలోకి విడిచిపెట్టారు.

కొర్లాంలో సమస్యలు పరిష్కరించండి



అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొర్లాం గ్రామస్థులు

సోంపేటరూరల్, జూలై14(ఆంధ్రజ్యోతి):కొర్లాం పంచాయతీలో సమస్యలు పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు.ఈ మేరకు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ బి.అశోక్‌కు కవిటి మండలంలోని రామయ్యపుట్టుగలో సోమవారం వినతిపత్రం అందజేశారు. సామాజిక భవనం నిర్మించాలని, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, రైల్వే స్టేషన్‌లో రైళ్లకు హాల్ట్ కల్పించాలని, పొత్తంగి పల్లెవెలుగు బస్సును బుడార్సింగి వరకు పొడిగించాలని, కోరారు. కార్యక్రమంలో గణపతి,వెంకటరావు, రాజేష్, పున్నయ్య, మురళి పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐల వివరాలు సేకరించండి: సీఈవో

ఎల్.ఎన్.పేట, జూలై 14(ఆంధ్రజ్యోతి): పంచాయతీలు అభివృద్ధికోసం తప్పనిసరిగా ప్రణాళికలను రూపొందించుకోవాలని జడ్పీ సీఈవో శ్రీధరరాజు తెలిపారు. సోమవారం ఎల్.ఎన్.పేటలో ఎంపీడీవో పి.శ్రీనివాసరావు అధ్యక్షతన మండల అధికారులు, గ్రామ సచి వాలయాల సిబ్బందితో పంచాయతీ పురోగతి సూచికపై సమీక్షించారు. శాఖల వారీగా అధికారులు గ్రామాల్లో అభివృద్ధి పనులను గుర్తించి పంచాయతీరాజ్‌శాఖ యాప్‌లో రెండురోజుల్లో అప్‌లోడ్‌చేయాలన్నారు. గ్రామాలో ఉన్న నాన్ రెసిడెన్షియల్ ఇండియన్స్(ఎన్ఆర్ఐ)ను గుర్తించి వారి ఫోన్‌నెంబర్లతోపాటువివరాలను రెండురోజుల్లో సేకరించాలన్నారు.సమావేశంలో తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ, ఈవోపీఆర్డీ పి.శ్రీనివాసులు, బి. రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

●మెళియాపుట్టి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకురావడానికి సహకరించాలని జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజ్ కోరారు. మెళియాపుట్టిలో వీఆర్వోలు, కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.పాపారావు, ఎంపీడీవో ప్రసాద్‌పండా, ఈవోపీఆర్డీ తారకేశ్వరి పాల్గొన్నారు.

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తాం

పలాస, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తామని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు.సోమవారం పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 12 దరఖాస్తులు అందాయి. కుళాయిలు కావాల్సిన వారు నేరుగా తమకు సంప్రదించాని కమిషనర్ కోరారు. ఫిర్యాదులు పరిష్కరించడానికి సిబ్బందికి పంపించినట్లు తెలిపారు.

పార్కు నిర్మాణానికి భూములు ఇవ్వవద్దు

నరసన్నపేట, జూలై 14(ఆంధ్రజ్యోతి) నలభై సంవత్సరాలుగా ప్రభుత్వం ఇచ్చే భూముల్లో పంటలు సాగుచేసి జీవిస్తున్నామని, ఆ భూములను ఎంఎస్ఎం పార్కు నిర్మాణానికి కేటాయించవద్దని జమ్ము గ్రామానికి చెందిన దళిత రైతులు కోరారు.ఈ మేరకు సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల నమోదు కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు గంగరాపు పెంటయ్య, టి. రాజారావు, టి మొఖలింగం, గంగరాపు సింహాచలం, పొట్టిన్న , బి. జ్యోతి , కొంగరాపు చిన్నవాడు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా

మందస, జూలై14(ఆంధ్రజ్యోతి):మందస తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కుతహసీల్దార్ మిస్క శ్రీకాంత్, ఎంపీడీవో వెంకటరమణ, ట్రాన్స్‌కో ఏఈ యోగేశ్వరరావు హాజరుకాగా మిగతా అధికారులు గైర్హాజరయ్యారు. వ్యవసాయంతోపాటు కీలకశాఖల అధికారులు డుమ్మా కొట్టారు.

క్షయవ్యాధి నిర్మూలనే ధ్యేయం

కోటబొమ్మాళి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నిర్మూలనే ధ్యేయమని క్షయ నియంత్రణ అధికారి పీవీ ప్రసాద్ తెలిపారు. సోమవారం మండలంలోని సౌడాంలో టీబీ ముక్త భారత్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిసోకిన తర్వాత వ్యాధిగ్రస్థులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకొని నిర్ధేశించిన మందులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పి. రమణి, ఏఎన్ఎం ఎస్.ప్రభావతి, ఆశవర్కర్లు జి.సుశీల, రమణమ్మలు పాల్గొన్నారు.

పశుగ్రాసంతో అధిక పాల ఉత్పత్తి

కోటబొమ్మాళి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ప్రశుగ్రాసం పండించి శాస్త్రీయ పద్ధతిలో పశువులకు మేపితే అధిక పాల ఉత్పత్తి సాధించవచ్చని పశుసంవర్ధశాఖ సహాయక సంచాలకుడు ఎం.లోకనాథం తెలిపారు. సోమవారం కురుడులో పశుగ్రాస వారోత్సవాల్లోభాగంగా పశువైద్యాధికారి ఎల్.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పాడి రైతులకు అవగాహనకల్పించారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు నాళ్ల చిన్ని, బోర నాగభూషణరావు, శిమ్మ రమణ, మెండ సూరిబాబు పాల్గొన్నారు.

ఇంటిపన్ను వివరాలు సరిచేసుకోవాలి

జలుమూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) ప్రతి పంచాయతీలోని ఇంటి పన్ను వివరాలు ఇదివరలో స్వర్ణ పంచాయతీ యాప్‌లో నమోదు చేశారని, వాటిలో తప్పులు సరిచేసి జాబితాలు తయారు చేయాలని ఎంపీడీవో కె.అప్పలనాయుడు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, పలువురు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

పాతపట్నం, జూలై14(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని టెక్కలి డీఎల్‌పీవో ఐవీ రమణ తెలిపారు. పాతపట్నంలోని ఎస్సీ సంక్షేమ బాలికల వసతి గృహంతోపాటు పలువసతి గృహాలు పట్టణంలోని ప్రధానకూడళ్లను సోమవారం పరిశీలించారు. ఆయన వెంట పాతపట్నం ఈవో ఊన రామచంద్ర రావు ఉన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసులు రాజీ చేసుకోవాలి



నరసన్నపేట: మధ్యవర్తిత్వం-దేశంకోసం అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయాధికారి, పోలీసులు, న్యాయవాదులు

టెక్కలి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతో కేసులు రాజీ చేసుకోవాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.నిర్మల కోరారు. సోమవారం టెక్కలి కోర్టు సముదాయంలో కక్షిదారులకు మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 90 రోజుల పాటు మధ్యవర్తిత్వంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

● నరసన్నపేట, జూలై 14(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతో కేసులను పరిష్కరించేందుకు కక్షిదారులకు మరింత అవగాహన పెంచాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎస్.వాణి తెలిపారు. సోమవారం నరసన్నపేటలో మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీపీ సంతోషి, సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎక్సైజ్ సీఐ రమణ, ఎస్ఐలు దుర్గాప్రసాద్, రంజిత్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు రావాడ కొండలరావు, సభ్యులు రేణంకి కృష్ణంనాయుడు, యాళ్ల నర్సింగరావు, జీవీ రమణ, జామి కామేశ్వరరావు, వాన శ్రీనివాసరావు, గొండు అప్పారావు పాల్గొన్నారు.

బ్యాలెట్ బ్యాక్సులతో రహస్య ఓటింగ్

● నగరంపల్లిలో విద్యార్థి నాయకుడి ఎన్నిక

వజ్రపుకొత్తూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి):నగరంపల్లి హైస్కూల్‌లో సోమవారం రహస్య ఓటింగ్ పద్ధతిలో విద్యార్థి నాయకుడికోసం ఎన్నిక నిర్వహించారు. విద్యార్థులకు ప్రజాస్వామ్యం గొప్పతనం తెలియజేయాలన్న ఉద్దేశంతో రహస్య ఓటింగ్ నిర్వహించినట్లు హెచ్ఎం టి.హేమారావు తెలిపారు. ఈ సందర్భంగా బాలబాలికలకు వేర్వేరు ఓటు వేసేందుకు బ్యాలెట్ బ్యాక్సులు ఏర్పాటు చేశారు. ఈ మేరకు విద్యార్థి నాయకుడిగా బి. సుమన్ ఎన్నికైనట్లు హెచ్ఎం ప్రకటించారు. ఎన్నికలఅధికారులుగా సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు కె.రమణ, టి .కమలకుమారి వ్యవహరించారు, కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ బి.లక్ష్మీపతి పాల్గొన్నారు.



క్యూలైన్‌లో నిలబడి ఓటు వేస్తున్న విద్యార్థులు

వంశధార కాలువలో జలకళ



గొల్లూరు వద్ద వంశధార కాలువలో నీటి ప్రవాహం

నందిగాం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంశధార ప్రధాన ఎడమకాలువలో జలకళ నెలకొంది. ఇటీవల కాలువలో మరమ్మతులు చేపట్టడంతో ఎగువ నుంచి వస్తున్న నీరు ఉధృతంగా ముందుకు వెళ్తోంది. మండలంలో గొల్లూరు నుంచి జడ్యాడ, కవిటి మీదుగా సైలాడ వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర కాలువలు ప్రవహిస్తున్నాయి. ఈ కాలువల ద్వారా ఎనిమిది వేల ఎకరాలకు నీరందుతోంది. సుభద్రాపురం ఎత్తిపోతల పథకం ద్వారా సుభద్రాపురం, పాలవలస, నీలాపురం, నందిగాం గ్రామాల్లోని మరో 200 ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు.ఈ ఏడాది కాలువల్లో పూడిక తొలగించడం, జూలై రెండో వారంలోనే నీరు ఎడమకాలువలో శివారు ప్రాంతాలకు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఏటా ఆగస్టు, సెప్టెంబరు రెండో వారం వరకూ కాలువల్లో నీటి ఉధృతి కనిపించేదికాదు. దీంతో నిరసనలు తెలియజేయడంతోపాటు జలవనరులు, గ్రీవెన్స్‌లో అధికారులు రైతులు వినతిప త్రాలు ఏటా అందించే వారు. వంశధార కాలువల ద్వారా ముందుగానే నీరు రావడంతో చెరువులు నింపడంతోపాటు కొన్ని ప్రాంతాల్లో ఎండిన ఎదపొలాలు, నారుమడులను తడుపుతున్నారు.

రోగులతో కిటకిట.. ఓపీ కోసం అగచాట్లు

● టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రికి జ్వరపీడితుల తాకిడి



జిల్లా కేంద్రాసుపత్రిలో ఓపీ చీటీల వద్ద బారులుతీరిన రోగులు

టెక్కలి, జూలై 14(ఆంధ్రజ్యోతి): టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రిలో సోమవారం రోగులతో కిటకిటలాడింది. కొద్దిరోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు జ్వరాలతో మంచంపట్టారు.దీంతో జ్వరపీడితుల తాకిడి పెరిగింది.ఈ నేపథ్యంలో సోమవారం ఒక్కరోజే 600క పైగా ఓపీనమోదైంది. వైరల్‌ఫీవర్స్, జ్వరాలు వంటి కేసులతో ఓపీ రద్దీగా ఉందని సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యారావు తెలిపారు. అయితే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుకు ఒకే క్యూలైన్ ఉండడం, త్వరగా లైన్‌క్లియర్ చేయడానికి చర్యలు తీసుకోకపోవడంతో ఓపీవద్ద రోగులు అవస్థలుపడ్డారు.ఔట్‌పేషెంట్ వివ రాల నమోదుకు మరో కంప్యూటర్ ఏర్పాటుచేయాలని రోగులు కోరుతున్నారు.

నేడు మండల సమావేశం

వజ్రపుకొత్తూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎన్. రమేష్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన ఉదయం పదిన్నరకు జరిగే సమావేశానికి అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

పలాస, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఐటీఐలో మిగులు సీట్లు ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ పైల జవహర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి రెండో విడత దరఖాస్తుచేసుకునే గడువు 20వ తేదీ వరకూ ప్రభుత్వం పొడిగించినట్లు పేర్కొన్నారు.విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం ఈనెల 22వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోగా ఐటీఐకు రావాలని కోరారు. 25న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐటీఐలో కోపా,ట్రేడ్‌లో మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఈవోగా హరికృష్ణ

కోటబొమ్మాళి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళిపంచాయతీ ఈవోగా టి. హరికృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హిరమండలం పంచాయతీ ఈవోగా పని చేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఈవోగా పని చేసిన నీలాపు శ్రీనివాసరావు మేఘవరం బదిలీపై వెళ్లారు.

ఆరోగ్య యోజనపై అవగాహన

నరసన్నపేట, జూలై14(ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 14వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్ల ఆధ్వర్యంలో సోమవారం ప్రధాన మంత్రి ఆరోగ్య యోజనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లత,వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ, ఎన్ఎస్ఎస్ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

రైతులకు సేవలందించండి

వజ్రపుకొత్తూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు మరింత సేవలందించాలని ఎమ్మెల్యే గౌతుశిరీష కోరారు.వజ్రపుకొత్తూరు పీఏసీఎస్‌ఛైర్మన్‌గాకణితి సురేష్, సభ్యులుగా సభ్యులు కె.అప్పారావు, ఆర్. శాంతారావునుప్రభుత్వంనియమించడంతో ఎమ్మెల్యేను కలిశారు.కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మోహనరావు పాల్గొన్నారు.

శక్తియాప్ అవసరం

కాశీబుగ్గ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆపద సమయంలో శక్తియాప్ అవసరమని శక్తియాప్ ఎస్ఐ ఎం .రవి కుమార్ తెలిపారు. సోమవారం మునిసిపాలిటీ పరిధిలోని చినబాడాంలోని సాయి శిరీష హైస్కూల్‌లో శక్తియాప్‌ను ఎలా వినియోగించాలి, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, యాంటీడ్రగ్స్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గిరిధర్

పోలాకి,జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంపలాం గ్రామానికి చెందిన నల్లాన వెంకటకృష్ణ గిరిధర్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగానియమించారు.ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, ఏపీ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు చేతుల మీదుగా నియమకపు ధ్రువపత్రం అందుకున్నారు.

సబ్‌జైల్‌లో తనిఖీ

నరసన్నపేట, జూలై 14(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట సబ్‌జైల్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు సోమవారం తనిఖీచేశారు. కార్యక్రమంలో స్థానిక సివిల్‌కోర్టు న్యాయాధికారి ఎస్. వాణి, సబ్‌జైలర్ పాల్గొన్నారు.

●పాతపట్నం,జూలై14(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌జైల్‌ను జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీకార్యదర్శి కె.హరిబాబు సందర్శించారు. అనంతరం నవజీవన్ ఆశ్రమ అనాథబాలల ఆశ్రమాన్ని పరిశీలించారు.

ఎల్ఈడీ టీవీ వితరణ

కోటబొమ్మాళి, జూలై 14(ఆంధ్రజ్యోతి) : బిర్లంగి పాఠశాలకు గ్రామానికి చెందిన దుంపల మోహనరావు ఎల్ఈడీ టీవీని సోమవారం అందజేశారు.

●టెక్కలి, జూలై 14(ఆంధ్రజ్యోతి): టెక్కలి పంచాయతీ గోపినాథపురం ప్రాథమిక పాఠశాలలో 40మంది విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు పొట్నూరు వెంకట్రావు స్టీల్‌ప్లేట్లు పంపిణీ చేశారు.